

రెండు వేలమందికి రమదాన్ కానుక

● అందించిన సీఎం స్టాలిన్



కానుకలు ప్రదానం చేస్తున్న సీఎం

అడయార్, మార్చి 12: పవిత్ర రంజాన్ మాస ప్రారంభాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరుల ఉపవాస దీక్షలకు ఉపయోగపడేలా 2 వేల మంది ముస్లిం ప్రజలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రమదాన్ బహుమతిని మంగళవారం అందజేశారు. 'సాయం చేయడం మన ప్రధాన కర్తవ్యం' అనే నినాదంతో ఆయన తన సొంత నియోజకవర్గమైన కొళత్తూరులో ఈ సహాయాలను పంపిణీ చేశారు. ఈ బహుమతిలో 26 కిలోల బియ్యం, వస్త్రాలతో పాటు ఖర్జూరం, ఆర్థిక సాయంతో మొత్తం 10 రకాల వస్తువులు న్నాయి. ఈ బహుమతిని అందుకున్న ముస్లిం మహిళలు ముఖ్యమంత్రిని అభినందనల్లో ముంచెత్తారు. అలాగే, కేంద్రం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ బిల్లు 2019ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఏవీ వేలు, పీకే శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పొల్లాచ్చికి సీఎం

కోయంబత్తూరు జిల్లాలోని పొల్లాచ్చిలో ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం పర్యటించనున్నారు. అక్కడ జరిగే కార్యక్రమంలో 20 వేలమంది లబ్ధిదారులకు ఆయన సంక్షేమ సహాయాలను పంపిణీ చేయనున్నారు. అలాగే, పొల్లాచ్చితో పాటు జిల్లావ్యాప్తంగా చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేస్తారు. ఈ విషయంపై కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. బుధవారం పొల్లాచ్చి అచ్చిపట్టిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని కోవై, నీలగిరి, ఈరోడ్, తిరుపూరు జిల్లాల్లో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు మంత్రులతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా పాల్గొంటారని కలెక్టర్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.



గవర్నర్‌తో సమావేశమైన వీసీలు

తొలిసారి ఓటర్లలో అవగాహన పెంచండి

● వందశాతం ఓటు వేయిస్తే సత్కరిస్తాం
● వీసీలకు గవర్నర్ సూచన

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటు శాతం పెంపు కోసం యూనివర్శిటీల వైస్‌చాన్సలర్లు తమ వంతు కృషి చేయాలని గవర్నర్ ఆర్‌ఎన్ రవి పిలుపునిచ్చారు. రాష్ట్ర యూనివర్శిటీలకు ఛాన్సలర్ అయిన గవర్నర్.. మంగళవారం రాజ్‌భవన్‌లో వీసీలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించడంపై వీసీలకు పలు సూచనలు చేశారు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే యువత వందశాతం పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లేలా వీసీలు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. వందశాతం ఓటింగ్ సాధించేందుకు విశ్వవిద్యాలయాలు కూడా వ్యూహ రచన చేయాలని ఆదేశించారు. తొలిసారి ఓటర్లలో అవగాహన కల్పించడాన్ని ఒక మిషన్‌గా భావించాలన్నారు. వచ్చే పది రోజుల్లో యువతకు ఐడీ కార్డులు అందించడం, ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సాయంతో అవగాహన కల్పించడం, ఓటర్లకు ఈ-సర్టిఫికెట్లను జారీ చేయడానికి యాప్‌ను అభివృద్ధి చేయడం వంటి వాటిని ప్రోత్సహించాలన్నారు. వందశాతం ఓటింగ్ సాధించే కళాశాలల నిర్వాహకుల్ని సత్కరిస్తామన్నారు. యువతలో అత్యధిక ఓట్లు పోలయ్యేలా చర్యలు చేపట్టిన వారిని కూడా సన్మానిస్తామన్నారు. అందువల్ల ఇప్పటి నుంచి యూనివర్శిటీలు, వాటి అనుబంధ కళాశాలల ఆధ్వర్యంలో ఓటు హక్కు అవగాహన ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని గవర్నర్ ఆదేశించారు. అంతేగాక ఈ సందర్భంగా ఆయన ఓటు శాతం పెంపుపై పలు కీలక సూచనలు కూడా చేశారు.

చెన్నై - మైసూరు మధ్య రెండో 'వందే భారత్'

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన ప్రధాని ● పాల్గొన్న గవర్నర్, కేంద్రమంత్రి



అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ప్రధాని

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చెన్నై - మైసూరు మధ్య రెండో వందే భారత్ రైలు ప్రారంభమైంది. దీన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మంగళవారం ఉదయం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. కాగా చెన్నై సెంట్రల్‌లో గవర్నర్ ఆర్‌ఎన్ రవి, కేంద్ర సమాచార శాఖ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్, దక్షిణ రైల్వే అదనపు జనరల్ మేనేజర్ కైశల్ కిశోర్, చెన్నై డివిజనల్ రైల్వే మేనేజర్ బి.విశ్వనాథ్ తదితరులు ఈ రైలుకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. నెం.20663/20664 రైలు ఈనెల 14 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు కాట్పాడి, కృష్ణరాజపురం మీదుగా ఎస్ఎంవీటీ బెంగళూరుకు వెళ్తుంది. ఏప్రిల్ 5వ తేదీ నుంచి కాట్పాడి, కేఎస్ఆర్ బెంగళూరు, మాండ్య మీదుగా మైసూరు వరకు నడుస్తుంది. ఈ రైలు ఉదయం 6 గంటలకు మైసూరులో బయలుదేరి మధ్యాహ్నం 12.20 గంటకలు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. తిరిగి ఇదే రైలు సాయంత్రం 5 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి రాత్రి 11.20 గంటలకు మైసూరు చేరుకుంటుంది.

పథకాలు జాతికి అంకితం

మైసూరు - చెన్నై వందేభారత్ రైలు ప్రారంభోత్సవంతో పాటు దక్షిణ రైల్వేలో పలు అభివృద్ధి పథకాలను ప్రధానమంత్రి మోదీ జాతికి అంకితం చేశారు. బేసిన్ బ్రిడ్జ్ కోచింగ్ యార్డ్ వద్ద పిట్ లైన్ ఎస్ఎల్ 9, ఎస్ఎల్ 10లో 24 ఎల్‌హెచ్‌బీ కోచ్ పొడవు కోసం రెండు క్యాప్‌టెక్ పిట్‌లైన్లు రూ.52.6 కోట్లతో ఏర్పాటు చేశారు. కొత్త స్టాండర్డ్ పిట్ లైన్‌లు బోగీలను సులభంగా శుభ్రపరచడం, నిర్వహణ కోసం హైప్రెజర్ పైప్‌లైన్‌లతో అమర్చబడి ఉంటాయి. రాత్రి సమయాల్లో నిర్వహణ కోసం లైటింగ్ ఏర్పాట్లు, నీటి స్తబ్దత నివారించడానికి కలెక్షన్ వెల్, పంపింగ్ వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. వందేభారత్ కోచ్‌లు, ఇతర ప్రీమియం రైళ్ల కోసం ఏర్పాటు చేశారు. దీన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. అదే విధంగా సింగపెరుమాళ్ కోయిల్, గంగైకొండాన్, తేని, పట్టుకోట్టై, తిరుత్తురైపూండి, వల్లియూర్‌లో ఏర్పాటైన గూడ్స్ షెడ్లను జాతికి అంకితం చేశారు. ఈ షెడ్ వల్ల సరకు రవాణాకు మార్గం సుగమం అవుతుంది. అదేవిధంగా దిండుగల్, ఈరోడ్డు, తిరుచ్చి, పాలక్కాడ్‌లలో నిర్మితమైన జన్ ఔషధి కేంద్రాలను కూడా ప్రధాని జాతికి అంకితం చేశారు. 'ప్రధాన మంత్రి జన్ ఔషధి' పథకం కింద అందరికీ నాణ్యమైన మందులు, వినియోగ వస్తువులను సరసమైన ధరకు అందుబాటులో ఉంచాలనే భారత ప్రభుత్వ మిషన్‌ను ప్రోత్సహించడానికి ఈ జన్ ఔషధి కేంద్రాలు ఏర్పాటయ్యాయి.



మైసూరుకు బయలుదేరుతున్న వందేభారత్‌కు సాంస్కృతిక వీడ్కోలు

అదేవిధంగా చెన్నై సెంట్రల్‌లో ఏర్పాటైన రైల్ కోచ్ రెస్టారెంట్‌ను కూడా జాతికి అంకితం చేశారు. 205 స్టేషన్లలో ఏర్పాటైన 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' (ఓఎస్ఓపీ)స్టాళ్లను కూడా ప్రధాని ప్రారంభించారు. ఓకల్ ఫర్ లోకల్ మిషన్‌ను ప్రోత్సహించడానికి, స్థానిక/స్వదేశీ ఉత్పత్తులకు మార్కెట్‌ను అందించడానికి, సమాజంలోని అట్టడుగు వర్గాలకు అదనపు ఆదాయ అవకాశాలను కల్పించడానికి ఏర్పాటైన భారత ప్రభుత్వ మిషన్‌కు అనుగుణంగా ఈ స్టాళ్లు ఏర్పాటయ్యాయి. ఇదిలా ఉండగా దక్షిణ రైల్వేలో రాబోయే నాలుగేళ్లలో ఆర్డినరీ రైలు బోగీలు తొలగించి ఆధునిక బోగీలుగా మార్చనున్నారు. చెన్నై - బీచ్ - ఎగ్మూర్ నాల్గో రైలుమార్గం పనులు వచ్చే జూన్‌కి పూర్తవుతాయని, ఆ తర్వాత చెన్నై బీచ్ - వేళచ్చేరి వరకు విద్యుత్ రైలుసేవలు ప్రారంభమవుతాయని రైల్వే అధికారులు తెలిపారు. చెన్నై నుంచి శివారు ప్రాంతాలకు నడుపుతున్న సబర్బన్ రైళ్లలో ఏసీ బోగీలు జత చేసి తొలివిడతగా మే నుంచి రెండు రైళ్లను నడపనున్నట్లు దక్షిణ రైల్వే శాఖ తెలిపింది.

నెత్తురోడిన రోడ్లు

రెండు ప్రమాదాల్లో ఏడుగురి దుర్మరణం

బస్ ఫుట్‌బోర్డ్‌పై ప్రయాణిస్తున్న నలుగురి మృత్యువాత



మృతులు ధనుష్, రవిచంద్రన్, కమలేష్, మోనీష్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, మార్చి 12: రాష్ట్రంలో మంగళవారం ఉదయం జరిగిన రెండు వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో నలుగురు కళాశాల విద్యార్థులు సహా ఏడుగురు మృతి చెందారు. వివరాలిలా వున్నాయి... చెంగల్పట్టు జిల్లా మదురాంతకం సమీపంలోని ప్రైవేటు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారు. వీరు ప్రతిరోజూ ప్రభుత్వ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో కళాశాలకు వస్తుంటారు. మంగళవారం ఉదయం అచ్చిరుపాక్కం, దుబ్బాక్కం గ్రామాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఓ ప్రైవేటు బస్సులో పాఠశాలకు బయల్దేరారు. బస్సు రద్దీగా ఉండడంతో పలువురు విద్యార్థులు ఫుట్‌బోర్డుపై ప్రయాణించారు. ఆ సమయంలో రోడ్డు పక్కన నిలిపిన కంటైనర్ లారీని బస్సు రాసుకుంటూ వెళ్లింది. ఈ ఘటనలో ఫుట్ బోర్డుపై ప్రయాణిస్తున్న ఎలపాక్కం గ్రామానికి చెందిన బీబీఏ రెండో సంవత్సర విద్యార్థి ధనుష్(19), మోకల్‌వాడి గ్రామానికి చెందిన బీకాం మొదటి సంవత్సర విద్యార్థి రవిచంద్రన్(18), అదే గ్రామానికి చెందిన బీఏ రెండో సంవత్సరం విద్యార్థి మోనీష్(19), సోత్తుపాక్కం గ్రామానికి చెందిన కంప్యూటర్ సైన్స్ రెండో సంవత్సర విద్యార్థి కమలేష్(19)కు తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ఇద్దరు సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, మరో ఇద్దరు మదురాంతకం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. ఈ ఘటనలో గాయపడిన మరి కొందరు విద్యార్థులను ఆసుపత్రికి తరలించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈరోడ్ జిల్లాలో...

ఈరోడ్ జిల్లా నంబియూర్ ప్రాంతానికి చెందిన కుమార్(60), ముల్లకినరు ప్రాంతానికి చెందిన సెల్వం, సౌందర్‌రాజ్, చెన్నయ్యన్(55), కాంచనాయకనూరు ప్రాంతానికి చెందిన సెల్వం (50), ఈరోడ్‌కు చెందిన మనోహర్ మంగళవారం ఉదయం కారులో కర్ణాటక రాష్ట్రం నంజంకూడు ప్రాంతంలోని శివాలయానికి బయల్దేరారు. ఆ సమయంలో తాళవాడి కొండ 27వ ఘాట్‌లో వస్తున్న కారు ఎదురుగా చెరకు లోడుతో వస్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో కుమార్, చెన్నయ్యన్, కాంచనాయకనూరుకు చెందిన సెల్వం సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని గాయాలతో కొట్టుమిట్టాడుతున్న ముగ్గురిని కారు శిథిలాల నుంచి వెలికి తీసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

డ్రగ్స్ విక్రయ కేంద్రంగా తమిళనాడు

● అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్



అభిరామపురంలో మానవహారంలో పాల్గొన్న ఈపీఎస్ తదితరులు

ప్యారీస్, మార్చి 12: డ్రగ్స్ విక్రయ కేంద్రంగా తమిళనాడు మారిందని, వీటి రవాణా కట్టడి చేయడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో నిషేధించిన గంజాయి, గుట్కా తదితర మత్తుపదార్థాలను విక్రయించిన ముఠాలను పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, దేశ రాజధాని ఢిల్లీలో అంతర్జాతీయ మార్కెట్లో కోట్లు విలువైన మత్తుపదార్థాలను మత్తుపదార్థాల నివారణ విభాగం పోలీసులు ఇటీవల స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో పట్టుబడిన జాఫర్‌సాధిక్ సహా ముగ్గురు రాష్ట్రానికి చెందిన వారు కావడం గమనార్హం. ఈ చర్యలకు పాల్పడిన జాఫర్‌సాధిక్‌ను డీఎంకే అధిష్ఠానం పార్టీ నుంచి తొలగించడంతో రెండు రోజుల క్రితం రాజస్థాన్‌లో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎంకే నాయకుడైన జాఫర్‌సాధిక్‌పై రాష్ట్రప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ కొన్ని రోజుల క్రితం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో, మంగళవారం రాష్ట్రంలో మత్తుపదార్థాల చలామణీ కట్టడి చేయాలన్న డిమాండ్‌తో మానవహారం నిర్వహించనున్నట్లు అన్నాడీఎంకే అధిష్ఠానం ప్రకటించింది. ఈ మేరకు అభిరామపురం కామరాజర్ రోడ్డులో పళనిస్వామి అధ్యక్షతన నిర్వహించిన మానవహారంలో పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళమగన్‌హుస్సేన్, మాజీ మంత్రి గోకుల ఇందిర, మాజీ ఎంపీ జయవర్ధన్ సహా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ధర్నాను ప్రారంభించిన పళనిస్వామి మాట్లాడుతూ... డ్రగ్స్ రవాణా కట్టడిలో విఫలమైన డీఎంకే ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ అన్నాడీఎంకే తరఫున చెన్నై, కోవై, మదురై, తిరునల్వేలి సహా అన్ని ప్రధాన నగరాలు, కార్పొరేషన్, పంచాయతీల్లో మానవహారం నిర్వహించామన్నారు. ప్రజారోగ్యం కోసం చేపట్టిన ఈ నిరసనలో ప్రజలు కూడా పెద్దసంఖ్యలో పాల్గొని తమకు మద్దతు తెలిపారన్నారు. రాష్ట్రంలో అసమర్థ డీఎంకే పాలన వల్ల మత్తుపదార్థాల వినియోగం బాగా పెరిగిందని, దీన్ని అడ్డుకోవాలంటూ బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా తాము పలుమార్లు రాష్ట్రాన్ని హెచ్చరించినా పట్టించుకోలేదని విమర్శించారు. రాజధాని నగరం చెన్నైలో గత ఆరు రోజుల్లో పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో 55 మంది నేరస్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి 63.8 కిలోల గంజాయి, 60 గ్రాముల మత్తుపదార్థాలతో పాటు యువతకు విక్రయించిన 1,752 మత్తు బిళ్లలను స్వాధీ నం చేసుకున్నారని, ఈస్థాయిలోనే మిగతా జిల్లా ల్లో కూడా డ్రగ్స్ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోందన్నారు. అయితే దీనిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. డ్రగ్స్ వినియోగం రాష్ట్రంలో పెరిగినందు వల్ల ప్రపంచ దేశాల ముందు తమిళనాడు తలవంచుకొనే పరిస్థితి నెలకొందన్నారు.డ్రగ్స్ స్మగ్లింగ్ ముఠా నాయకుడు జాఫర్‌సాధిక్‌తో అధికారపార్టీ నేతలకు సంబంధాలున్నాయని, దీనిపై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తమిళనాడు మారే వరకు తాము పోరాడుతూనే ఉంటామని ఎడప్పాడి చెప్పారు. ఉత్తర చెన్నై దక్షిణ పశ్చిమ జిల్లా కార్యదర్శి బాలగంగ నేతృత్వంలో, తండయార్‌పేటలో జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ రాజేష్ అధ్యక్షతన, రాయపురంలో మాజీ మంత్రి డి.జయకుమార్ అధ్యక్షతన నిర్వహించిన మానవహారంలో పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 4 శాతం పెంపు

ప్యారీస్, మార్చి 12: రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, టీచర్లకు 4 శాతం డీఏ పెంచుతూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సచివాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కరోనా అనంతరం రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక ఇబ్బందుల నుంచి ప్రభుత్వం క్రమక్రమంగా ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. వీరి డీఏ డిమాండ్‌ను పరిశీలించి 2023 జూలై 1వ తేది నుంచి కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు డీఏ శాతం పెంపులాగా రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, పెన్షనర్ల సంక్షేమార్థం ప్రస్తుతం 46 శాతంగా ఉన్న డీఏను 50 శాతానికి పెంచుతూ సీఎం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది ఈ సంవత్సరం జనవరి 1వ తేది నుంచి ఉద్యోగులకు వర్తిస్తుందని, డీఏ పెంపు వల్ల సుమారు 16 లక్షలమంది ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, పింఛన్‌దారులు, కుటుంబ పింఛన్‌దారులు లబ్ధిపొందుతారని పేర్కొన్నారు. అందువల్ల సంవత్సరానికి ప్రభుత్వానికి అదనంగా రూ.2587.91 కోట్లు ఖర్చవుతుందని, ఈ నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేస్తుందని తెలిపింది. కాగా, డీఏ పెంచాలన్న తమ డిమాండ్‌ను అమలుపరచిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్ల సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

పార్థసారథి ఆలయ ఉద్యోగులకు ఇళ్ల పంపిణీ



క్రీడా మైదానం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఉదయనిధి

ప్యారీస్, మార్చి 12: స్థానిక ట్రిప్లికేన్‌లో ప్రసిద్ధిచెందిన పార్థసారథి స్వామి ఆలయ సిబ్బందికి రూ.2.25 కోట్ల విలువైన ఇళ్లను మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి పంపిణీ చేశారు. హిందూ దేవాదాయ శాఖ నిర్వహణలో ఉన్న ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులు, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి కొత్త దుస్తులు, యూనిఫాం, పొంగల్ కానుక, ఇళ్ల కేటాయింపు, పెన్షన్, కుటుంబ పెన్షన్ తదితర పథకాలను అందిస్తున్న విషయం తెలిసిందే. 2021-22వ ఆర్థిక సంవత్సరంలో దేవాదాయ శాఖ తరఫున అసెంబ్లీలో ప్రకటించిన మేరకు ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయానికి సొంతమైన స్థలంలో ఉభయదారుల సహకారంతో 6,057 చదరపు అడుగుల విస్తీర్ణంలో క్వార్టర్స్, భక్తుల విశ్రాంతి గృహాన్ని రూ.2.25 కోట్లతో నిర్మించారు. వీటిని ప్రారంభించిన మంత్రి ఉదయనిధి... చింతాద్రిపేటలో 3.73 ఎకరాల్లో మేడే పార్కు ప్లే గ్రౌండ్‌ను సీఎండీఏ తరఫున రూ.10 కోట్ల వ్యయంతో వ్యా యామ కేంద్రం నిర్మించే పనులకు శంకుస్థాపన చేశారు. హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు, సెంట్రల్ చెన్నై ఎంపీ దయానిధి మారన్, నగర మేయర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
బుధవారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.26
గురువారం : సహర్ : ఉదయం - 4.37



సమాచార దర్శిని

పుదుచ్చేరి-తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ పాక్షిక రద్దు

పెరంబూర్, మార్చి 12: పుదుచ్చేరి - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ బుధవారం నుంచి 23వ తేది వరకు పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. నెం.16112 పుదుచ్చేరి - తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం నుంచి 23వ తేది వరకు తిరుపతికి బదులుగా తిరుత్తణి వరకు మాత్రమే నడపనున్నారు. అలాగే, నెం.16111 తిరుపతి - పుదుచ్చేరి మెమో రైలు ఈ రోజుల్లో తిరుపతికి బదులుగా ఉదయం 6.40 గంటలకు తిరుత్తణి నుంచి బయల్దేరనుంది.

నేడు తిరుప్పూర్‌కు గవర్నర్

ప్యారీస్, మార్చి 12: బడుగు, బలహీనవర్గాలకు కేంద్ర ప్రభుత్వం తరపున సూరజ్ పథకం కింద వివిధ సంక్షేమ సహాయాలను పంపిణీ చేయడానికి రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి బుధవారం తిరుప్పూర్ వెళ్లనున్నారు. సూరజ్ పథకం కింద సంక్షేమ సహాయాల పంపిణీలో భాగంగా దేశవ్యాప్తంగా 600 జిల్లాల్లో ఆన్‌లైన్ ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం తిరుప్పూర్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం 3.45 గంటలకు జరగనుంది. ఈ సందర్భంగా 300 మందికి వివిధ పథకాలు అందిస్తారు.

బెర్త్ సౌకర్యంతో 260 ఎక్స్‌ప్రెస్ బస్సులు

ఐసిఎఫ్, మార్చి 12: ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థలో సీటు, బెర్త్ సౌకర్యంతో 260 కొత్త డీలక్స్ బస్సులు నడపనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో చెన్నై, తిరుచ్చి, తిరునల్వేలి, బెంగళూరు, తిరుపతి వంటి నగరాలకు ప్రతిరోజు 1,080 ఏసీ డీలక్స్ బస్సులు నడుపుతుండగా, లక్షమంది ప్రయాణిస్తున్నారు. పాత బస్సులు తొలగించి కొత్త బస్సుల కొనుగోలుకు రవాణా సంస్థ నిర్ణయించింది. ఈ విషయమై ఆ శాఖ అధికారులు మాట్లాడుతూ... మూడు విడతల్లో 4,300 కొత్త బస్సులు కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వ రవాణా సంస్థలకు 1,138 శివారు ప్రాంత బస్సులు, 1,190 సిటీ బస్సులు, 672 ఇతర బస్సుల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించామన్నారు. మే నెలలో 260 కొత్త ఏసీ డీలక్స్ బస్సులు నడపనున్నామని పేర్కొన్నారు.

సెమ్మంజేరిలో మురుగునీటి పైప్‌లైన్

ఐసిఎఫ్, మార్చి 12: స్థానిక సెమ్మంజేరిలో రూ.78 కోట్లతో పైప్‌లైన్ ఏర్పాటు పనులను చెన్నై తాగునీటి బోర్డు చేపట్టింది. షోళింగనల్లూర్ మండలం 200వ వార్డు పరిధికి చెందిన సెమ్మంజేరిలో భూగర్భ డ్రైనేజీ పథకం కింద మురుగునీటి పైప్ లైన్‌ల ఏర్పాటు ఈ నెల 8వ తేది ప్రారంభమయ్యాయి. మురుగునీరు పంపింగ్ స్టేషన్, మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయనున్నారు.

కోవై - భగత్ కి కోఠి మధ్య ప్రత్యేక రైలు

పెరంబూర్, మార్చి 12: హోళి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం కోయంబత్తూర్ నుంచి రాజస్థాన్‌లోని భగత్ కి కోఠి మధ్య ప్రత్యేక రైలు నడపనున్నారు. నెం.06181 కోవై - భగత్ కి కోఠి స్పెషల్ ఈ నెల 14, 21, 28, ఏప్రిల్ 4వ తేదీ (గురువారం) మధ్యాహ్నం 2.30 గంటలకు కోయంబత్తూర్‌లో బయల్దేరి మూడో రోజు ఉదయం 11.30 గంటలకు భగత్ కి కోఠి చేరుకుంటుంది. అలాగే, నెం.06181 భగత్ కి కోఠి - కోయంబత్తూర్ స్పెషల్ ఈ నెల 17, 24, 31, ఏప్రిల్ 7వ తేదీ (ఆదివారం) రాత్రి 7.30 గంటలకు భగత్ కి కోఠిలో బయల్దేరి మూడో రోజు ఉదయం 9.30 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది. ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ ఈనెల 13 నుంచి ప్రారంభమవుతుంది.

పలువురు ఐపీఎస్‌లకు పదోన్నతి, బదిలీలు

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలువురు ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. అలాగే కొందరికి పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి పి.అముద మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా వున్నాయి...

బదిలీలు...

సీబీసీఐడీ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ డివిజన్ ఐజీగా ఉన్న పీసీ తెన్‌మొళిని తమిళనాడు పోలీస్ అకాడమీ ఐజీపీగా, తిరుచ్చి నార్త్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న వి.అన్బును చెన్నై రైల్వే ఎస్పీగా, తిరుప్పూర్ దక్షిణ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న ఎస్.వనితను స్టేట్ పోలీస్ మాస్టర్ కంట్రోల్ రూం ఎస్పీగా, ఇప్పటి వరకూ ఆ పదవిలో ఉన్న డి.రమేష్‌బాబును గ్రేటర్ చెన్నై పోలీస్ మోడర్న్ కంట్రోల్ రూం డిప్యూటీ కమిషనర్‌గా, ఇప్పటి వరకూ ఆ పదవిలో ఉన్న ఎస్ఎస్ మహేశ్వరన్‌ను గ్రేటర్ చెన్నై పోలీస్ సెక్యూరిటీ డిప్యూటీ కమిషనర్‌గా, కోయంబత్తూరు నార్త్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న రోహిత్ నాథన్ రాజగోపాల్‌ను కోయంబత్తూరు ట్రాఫిక్ విభాగా డిప్యూటీ కమిషనర్‌గా, మదురై దక్షిణ విభాగ డిప్యూటీ కమిషనర్ పి.బాలాజీని పోలీస్ వెల్ఫేర్ విభాగ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా, నాగపట్టినం కోస్టల్ సెక్యూరిటీ ఎస్పీ కె.ఆదివీర పాండ్యన్‌ను గ్రేటర్ చెన్నై అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు.

పదోన్నతులు...

అరక్కోణం సబ్ డివిజన్ ఏఎస్పీ యాదవ్ గిరీష్ అశోక్‌ను తిరుప్పూర్ దక్షిణ విభాగ డిప్యూటీ కమిషనర్‌గా, తేని జిల్లా ఉత్తమపాలయం ఏఎస్పీ మదుకుమారిని మదురై నార్త్ డీసీపీగా, శివగంగ జిల్లా కారైక్కుడి సబ్ డివిజన్ అసిస్టెంట్ ఎస్పీ డాక్టర్ ఆర్.స్టాలిన్‌ను కోయంబత్తూరు ఉత్తర విభాగ డీసీపీగా, తిరువళ్లూరు జిల్లా తిరువళ్లూరు సబ్ డివిజన్ ఏఎస్పీ వివేకానంద శుక్లాను తిరుచ్చి ఉత్తర విభాగా డీసీపీగా, విరుదునగర్ జిల్లా అరుప్పుకోట ఏఎస్పీ జీకే ఉద్ధవ్‌రావ్‌ను మదురై దక్షిణ విభాగా డీసీపీగా పదోన్నతితో పాటు బదిలీ కల్పించారు.

15,726 మంది క్షయ బాధితులు

ఐసిఎఫ్, మార్చి 12: నగరంలో 15,726 మంది క్షయ బాధితులున్నట్లు చెన్నై కార్పొరేషన్ తెలిపింది. జాతీయ క్షయ నిర్మూలన పథకం ద్వారా 2025 సంవత్సరంలోపు క్షయరహిత నగరంగా మార్చేందుకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. గత ఏడాది 3.70 లక్షల మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 11,273 మందికి క్షయ లక్షణాలున్నట్లు నిర్ధారణ అయ్యింది. ప్రైవేటు ఆసుపత్రుల్లో 4,553 మంది సహా 15,726 మంది చికిత్స పొంది ఉన్నారు. పౌష్టికాహారం లోపం కలిగిన వారు త్వరగా ఈ వ్యాధికి గురయ్యే అవకాశముందని, దీనిని దృష్టిలో పెట్టుకొని 17 స్వచ్ఛంద సంస్థలు, 160 స్వచ్ఛంద కార్యకర్తల ద్వారా 850 మంది క్షయ బాధితులకు పౌష్టికాహారం అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

తగ్గిన భూగర్భ జలమట్టం

ఐసిఎఫ్, మార్చి 12: నగరంలో కురిసిన భారీవర్షాల అనంతరం జనవరి కన్నా ఫిబ్రవరిలో 5 అడుగుల వరకు భూగర్భ జలమట్టం తగ్గిందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. నగరానికి అవసరమయ్యే తాగునీరు ఐదు జలాశయాలు, నిర్లవణీకరణ కేంద్రాల నుంచి ప్రతిరోజు 100 కోట్ల లీటర్లు లభిస్తోంది. చెన్నై విస్తరణ ప్రాంతాల్లో ఎక్కువగా భూగర్భ జలాలపైనే తాగునీటి కోసం ఆధారపడాల్సి వస్తోంది. జలాశయాల ఆక్రమణ, వర్షపు సేకరణ పథకాలు లేకపోవడం వంటి కారణాలతో నీటిమట్టాలు తగ్గగా, నగరంలోని 200 వార్డుల్లో నిర్మించిన వాననీటి కాలువలతో భూమిలో ఇంకాల్సిన నీరు సముద్రంలో కలవడంతో భూగర్భ జలమట్టాలు తగ్గాయని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.



చేనేత వృత్తి శిక్షణలో విద్యార్థులు

చేనేత వృత్తి బోధనకు 'చేయూత' ఎక్కడ?

(అడయార్)

చెన్నై మహానగరంలో చేనేత వృత్తి విద్యా కోర్సును బోధిస్తున్న పాఠశాలలు చాలా తక్కువగా ఉన్నాయి. అలాంటిలో టి.నగర్‌లోని సీడీ నాయగం బాలుర మహోన్నత పాఠశాల ఒకటి. చేనేతను వృత్తి విద్యా సబ్జెక్టుగా ప్రవేశపెట్టి బోధన సాగించి, ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్న స్కూల్.. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా ఆ కోర్సును మూసివేసే పరిస్థితి నెలకొంది. దీనికి కారణం... గత కొన్నేళ్లుగా ఈ పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత ఇవ్వకపోవడంతో నిధుల కొరతను ఎదుర్కొంటోంది.

'వృత్తి' ప్రోత్సహిస్తున్న ఏకైక పాఠశాల...

నిరుపేద పిల్లలకు ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో 1933లో తిరునెల్వేలి జిల్లాలోని కులశేఖరపట్టణానికి చెందిన చెట్టికుళం దేవనాయకం ఈ స్కూల్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచే ఈ పాఠశాల బహుశా రాష్ట్రంలోనే నేత కళల వృత్తిలో విద్యా బోధన చేసే ఏకైక స్కూల్‌గా గుర్తింపు పొందింది. ఈ పాఠశాలలో పనిచేసే అధ్యాపక సిబ్బంది పోత్సాహం కారణంగా చేనేత కోర్సులపై ఆసక్తి చూపించే విద్యార్థులు ఈ కోర్సులో చేరి శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వం నుంచి తగిన పోత్సాహం, నిధులు అందకపోయినప్పటికీ పాఠశాల యాజమాన్యంతో కలిసి ఉపాధ్యాయులే తమ సొంత డబ్బును ఖర్చు చేస్తూ విద్యార్థులకు నేత వృత్తుల్లో శిక్షణ ఇస్తున్నారు.

త్వరలో క్రాఫ్ట్ టీచర్ రిటైర్డ్...

ప్రస్తుతం ఈ పాఠశాలలో నేత వృత్తులను బోధించే ఉపాధ్యాయుడు త్వరలోనే పదవీ విరమణ చేయనున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం కల్పించుకుని కొత్త టీచర్‌ను నియమిస్తేనే ఈ శిక్షణ కొనసాగించేందుకు వీలుపడుతుంది. సాధారణంగా ఒక టీచర్ పదవీ విరమణ చేయగానే, అతనికి ఇచ్చే వేతన భత్యాలను ప్రభుత్వం నిలిపి వేస్తుందన్నారు. మళ్లీ ఆ పోస్టును భర్తీ చేస్తేనే తిరిగి ప్రభుత్వం వేతనం మంజూరు చేస్తుందన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదంటున్నారు. ఈ సంప్రదాయ చేనేత వృత్తి శిక్షణను తమ పాఠశాలలో కొనసాగించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తరపున కోరుతున్నట్టు చెప్పారు.

ఎంతకాలం కొనసాగుతుందో...

చేనేత వృత్తి నైపుణ్యంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఈ పాఠశాలలో శిక్షణ ఇస్తున్నట్టు క్రాఫ్ట్ టీచర్ విశ్వనాథన్ చెప్పారు. విద్యార్థులు నేర్చుకున్న నేత పనిని వారి తల్లిదండ్రులు ప్రశంసించినప్పటికీ ఇక్కడ బోధన ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. ఈ బోధన తనకు జీవనాధారం కావడంతో ఆర్థిక కష్టాలను సైతం తట్టుకుని కొనసాగుతున్నట్టు చెప్పారు.

బంగారం వంటి వస్త్రాల తయారీ...

చేనేత వృత్తిలో శిక్షణ పొందిన విద్యార్థులు అద్భుతమైన డిజైన్లతో బంగారంలాంటి దుస్తులను రూపొందిస్తున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి ఉమాపతి తెలిపారు. తమ పాఠశాలలో జరిగే వివిధ ఫంక్షన్లకు వచ్చే అతిథులకు తమ విద్యార్థులు నేసిన టవళ్లను బహూకరిస్తున్నట్టు చెప్పారు. తమ స్కూల్ గురించి తెలిసిన కొందరు ఇక్కడికి వచ్చి విద్యార్థులు నేసిన వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వం చేయూతనివ్వాలి

ఈ పాఠశాలలో ఈ చేనేత కోర్సు ప్రభుత్వ సహకారంతో నడుస్తుందని పాఠశాల నిర్వహణ కమిటీ కార్యదర్శి, అన్నా విశ్వవిద్యాలయం గణితశాస్త్రం మాజీ ప్రొఫెసర్ షణ్ముగం తెలిపారు. అరుదైన ప్రత్యేక సబ్జెక్టును బోధిస్తున్న పాఠశాలను ప్రభుత్వం ఆదుకోవడమేకాకుండా, ఈ వృత్తి విద్యా కోర్సుకు చేయూత ఇవ్వాలని ఆయన కోరారు.



నూలు ఎలా తీసుకోవాలో అవగాహన కల్పిస్తున్న క్రాఫ్ట్‌మాస్టర్ - తాము నేసిన టవళ్లతో విద్యార్థులు

రూ.6 కోట్ల ప్రభుత్వ స్థలం స్వాధీనం

ఐసిఎఫ్, మార్చి 12: స్థానిక పట్టాభిరాం సమీపంలో రూ.6 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టాభిరాం తండుదురై చేపల మార్కెట్ వెనుకవైపు సిత్తేరి జలాశయం ఉంది. దీని సమీపంలో 40 సెంట్ల స్థలాన్ని ఆక్రమించిన కొందరు భవనాలు నిర్మించి అద్దెకిచ్చారు. దీనిపై తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్‌కు ఫిర్యాదులందడంతో, ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులు సోమవారం ఆక్రమణలు తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పోలీసు జాగిలానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



జాగిలానికి పోలీసుల నివాళి

పెరంబూర్, మార్చి 12: అనారోగ్యంతో మృతిచెందిన పోలీసు జాగిలానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అరియలూరు జిల్లా పోలీసు శాఖలో ఎనిమిదేళ్లుగా డిక్సీ అనే జాగిలం పనిచేస్తోంది. సుమారు 400 కేసుల్లో నిందితులను గుర్తించి మంచి పేరు సంపాదించిన డిక్సీ అస్వస్థతకు గురికావడంతో చికిత్సలు అందించారు. ఫలించకపోవడంతో సోమవారం మృతి చెందింది. జాగిలం కళేబరానికి నివాళి అర్పించిన జిల్లా పోలీసు అధికారులు, 21 రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపి డిక్సీకి అంత్యక్రియలు నిర్వహించారు.

ఈ-సేవా కేంద్రాల ద్వారా ఎల్ఎల్ఆర్

పెరంబూర్, మార్చి 12: ఎల్ఎల్ఆర్ పొందేందుకు ఇక నుంచి ఈ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని రవాణా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 55 వేల ఈ-సేవా కేంద్రాల ద్వారా ఎల్ఎల్ఆర్ దరఖాస్తుల స్వీకరణ బుధవారం నుంచి అమల్లోకి రానుంది. ఇందుకోసం రూ.60 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఎల్ఎల్ఆర్ కోసం డ్రైవింగ్ శిక్షణ సంస్థలు, ఏజెంట్లను ప్రజలు నమ్మి మోసపోకుండా ఉండేలా రాష్ట్రప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని రవాణా శాఖ తెలియజేసింది.

తమిళ సంఘం వార్షికోత్సవాలు



విజేతలకు బహుమతుల పంపిణీ

వేలూరు, మార్చి 12: స్థానిక కాట్పాడిలోని ఎబినేజర్ మాధ్యమిక పాఠశాలలో మంగళవారం తమిళ సంఘం వార్షికోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కేంద్ర కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు రాము పాల్గొని, పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం



బస్ షెల్టర్ ప్రారంభిస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, మార్చి 12: గుడియాత్తం మున్సిపాలిటీ 36వ వార్డు అశోక్‌నగర్‌లో ఎంపీ నియోజకవర్గ నిధుల నుంచి నిర్మించిన బస్ షెల్టర్ ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేలూరు ఎంపీ కదిర్ ఆనందన్ రిబ్బన్ కత్తిరించి బస్ షెల్టర్ ప్రారంభించారు. గుడియాత్తం ఎమ్మెల్యే అములు విజయన్, నగర మండ్రం అధ్యక్షుడు సౌందర్‌రాజన్, యూనియన్ సెక్రటరీ, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగలు, నగదు చోరీ

వేలూరు, మార్చి 12: రత్నగిరి సమీపం కీల్‌మిన్నల్ ప్రాంతానికి చెందిన ఆనందన్ ఇంట్లో సోమవారం రాత్రి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు నగలు, నగదు చోరీ చేశారు. ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి 15 సవర్ల నగలు, రూ.50 వేల నగదు చోరీ చేశారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన రత్నగిరి పోలీసులు, నిందితుల కోసం ప్రత్యేక బృందం ఏర్పాటుచేసి గాలిస్తున్నారు.

రూ.383 కోట్ల కేటాయింపు

ఐసిఎఫ్, మార్చి 12: నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద విద్యార్థుల అడ్మిషన్లు పొందిన ప్రైవేటు పాఠశాలలకు ఫీజు కింద రూ.383 కోట్లను రాష్ట్రప్రభుత్వం కేటాయించింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించారు. ఎల్కేజీ, 1వ తరగతిలో చేరే విద్యార్థుల ఫీజును ఆ పాఠశాలలకు ప్రభుత్వం చెల్లిస్తోంది. గత విద్యా సంవత్సరం, ప్రస్తుత విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థుల ఫీజును ప్రభుత్వం ఇంకా చెల్లించలేదని ప్రైవేటు పాఠశాలలు పేర్కొనడంతో, 4,17,068 మంది విద్యార్థుల ఫీజు రూ.383.59 కోట్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2023-24 విద్యా సంవత్సరంలో చేరిన 70,553 మంది విద్యార్థుల ఫీజును వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరవగానే జమచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

బైక్ చోరీ యత్నం
ముగ్గురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ప్యారీస్, మార్చి 12: స్థానిక విరుగంబాక్కం పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో బైక్ చోరీకి యత్నించిన ముగ్గురు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటుపడింది. విరుగంబాక్కంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, రిజిస్ట్రేషన్ లేని వాహనాలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలను పోలీస్‌స్టేషన్ ప్రాంగణం, ఫుట్‌పాత్‌పై నిలపడం వల్ల ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో గత నెల 27న ట్రాఫిక్ విభాగం జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్ విరుగంబాక్కం పోలీస్‌స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి క్రిమినల్ కేసు, తగిన డాక్యుమెంట్లు లేకుండా స్వాధీనం చేసుకున్న వాహనాలను ఆ ప్రాంతం నుంచి సమీపంలో ఉన్న హిందూ దేవాదాయ శాఖకు చెందిన మైదానానికి తరలించాలని ఉత్తర్వులు జారీచేశారు. వాహనాల తరలింపు పనుల్లో పాల్గొన్న ముగ్గురు కానిస్టేబుళ్లు, ఐదు ద్విచక్ర వాహనాలు, రెండు గేర్ సైకిళ్లను దారిలో తమకు తెలిసిన మెకానిక్ దుకాణం వద్ద దించినట్లు ఫిర్యాదు అందింది. దీనిపై విజయ్‌కుమార్ విచారణ జరిపారు. అంతేకాకుండా, వాహనాలు దించిన ప్రాంతాల్లో సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించి కానిస్టేబుళ్లు జగన్, మణి, సత్యప్రభుపై చోరీ కేసు నమోదు చేసి వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విషవాయువు సోకి ఇద్దరి మృతి

పెరంబూర్, మార్చి 12: బావిలో పడిన మోటర్ బైక్‌ను వెలికితీసేందుకు యత్నించిన ఇద్దరు విషవాయువు సోకి మృతిచెందారు. కన్నియాకుమారి జిల్లా లక్ష్మీపురానికి చెందిన లింగం కుమారుడు సెల్వ(19) సోమవారం సాయంత్రం తన బైక్‌ను ఇంటి సమీపంలోని ప్రహరి లేని బావి సమీపంలో ఉంచాడు. ఊహించని విధంగా బైక్ బావిలో పడిపోయింది. దీంతో, బైక్ తీసేందుకు సెల్వ యత్నించగా, చీకటిగా ఉందని, ఉదయం తీసుకోవచ్చని తల్లిదండ్రులు సూచించినా వినిపించుకోలేదు. సెల్వ, తన బంధువు సెల్వం (35) ఇద్దరు తాడు సాయంతో బావిలోకి దిగారు. వారు ఎంతవరకు బయటకు రాకపోవడంతో అనుమానించిన కుటుంబసభ్యులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకొని బావి నుంచి మృతదేహాలు వెలికితీశారు. విషవాయువు సోకి ఇరువురు మృతి చెందారని నిర్ధారించిన కన్నియాకుమారి పోలీసులు, కేసు నమోదు చేశారు.

శ్మశాన కొల్ల ఉత్సవంలో ఘర్షణ

● నలుగురి అరెస్ట్

పెరంబూర్, మార్చి 12: స్థానిక నెర్‌కుండ్రంలో సోమవారం జరిగిన శ్మశాన కొల్ల వేడుకల్లో ఆ ప్రాంతానికి చెందిన పలువురు మద్యం తాగి పాల్గొన్నారు. ఆ సమయంలో వారి మధ్య ఘర్షణ తలెత్తగా హరిహరన్‌పై బాలమురుగన్, జయసూర్య, ఈశ్వర్, సుందర్ దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన కోయంబేడు పోలీసులు, నలుగురిని అరెస్ట్ చేశారు.

ఆలయానికి వచ్చిన మహిళలతో అసభ్య ప్రవర్తన

● బీజేపీ నాయకుడిపై కేసు నమోదు

పెరంబూర్, మార్చి 12: స్థానిక వ్యాసర్పాడిలో ఉన్న ఆలయానికి వచ్చిన మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన బీజేపీ నాయకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వ్యాసర్పాడి పన్నీర్‌సెల్వం నగర్‌కు చెందిన నిర్మల అన్నాడీఎంకే వెస్ట్ జిల్లా అమ్మా పేరవై ఉపాధ్యక్షురాలు. ఎస్వీ నటరాజన్ వీధిలోని శ్రీదేవినాగాత్తమ్మాళ్ ఆలయ నిర్వాహకులిగా కూడా ఆమె వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రెండు రోజుల క్రితం ఆలయానికి వచ్చిన మహిళల వద్ద మద్యం తాగి వచ్చిన బీజేపీ వెస్ట్ జిల్లా ఉపాధ్యక్షుడు అర్ముగం అలియాస్ వ్యాసై అర్ముగం అసభ్యంగా ప్రవర్తించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఆలయ నిర్వాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సెంబియం పోలీసులు అర్ముగంను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

కుమారుడు తిట్టాడని తండ్రి ఆత్మహత్య

పెరంబూర్, మార్చి 12: కుమారుడు తిట్టాడని తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యాసర్పాడి సెంట్రల్ అవెన్యూ రోడ్డుకు చెందిన టైలర్ బాలమురుగన్ (30) తన భార్యతో గొడవ పడుతుండేవాడు. ఆ సమయంలో బాలమురుగన్ తండ్రి ముత్తుకృష్ణన్(60) ఇద్దర్నీ సమాధాన పరుస్తుంటాడు. ఈ నేపథ్యంలో, సోమవారం సాయంత్రం మళ్లీ భార్యాభర్తలు గొడవపడడంతో ముత్తుకృష్ణన్ వారిని సమాధానపరిచేందుకు యత్నించగా, బాలమురుగన్ తండ్రిని తీవ్రంగా దూషించాడు. దీంతో, మనస్తాపం చెందిన ముత్తుకృష్ణన్ రాత్రి తన గదిలో ఉరేసుకున్నాడు. సమాచారం అందుకొని అక్కడకు చేరుకున్న ఎంకేబీనగర్ పోలీసులు మృతదేహాన్ని స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తేయాకు తోటల్లో పులుల సంచారం

పెరంబూర్, మార్చి 12: నీలగిరి జిల్లా కూడలూరు తేయాకు తోటల్లో పులులు సంచరించే దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. కేకల్ ప్రాంతంలోని తేయాకు తోటల్లో మూడు పులులు సంచరిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడ్డాయి. దీంతో, గూడలూరు ప్రాంతంలో పులుల సంచారంపై అటవీ శాఖ విచారణ చేపట్టింది.

510 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

వేలూరు, మార్చి 12: స్థానిక కాట్పాడి సమీపం పొన్నై ప్రాంతంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రత్యేక తహసీల్దార్ సురేష్‌కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం మంగళవారం ఉదయం ముత్తరసికుప్పంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆంధ్ర రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 510 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు.

ఏప్రిల్ 15కు పొన్ముడి కేసు వాయిదా

పెరంబూర్, మార్చి 12: మాజీ మంత్రి పొన్ముడికి వ్యతిరేకంగా దాఖలైన కేసు విచారణ ఏప్రిల్ 15వ తేదీకి మద్రాసు హైకోర్టు వాయిదా వేసింది. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో పొన్ముడిని కోర్టు విడుదల చేయడాన్ని వ్యతిరేకంగా సుమోటాగా నమోదుచేసి విచారిస్తున్న మద్రాసు హైకోర్టు, ఈ కేసు విచారణ ఏప్రిల్ 15 నుంచి 19వ తేది వరకు జరుగుతుందని పేర్కొంది.

రెండాకుల గుర్తుకు మళ్లీ చిక్కులు

● 25న హైకోర్టులో విచారణ

అడయార్, మార్చి 12: అన్నాడీఎంకే అధికారిక ఎన్నికల గుర్తు అయిన రెండాకులకు మళ్లీ చిక్కుముడి పడింది. ఈ గుర్తు వివాదానికి సంబంధించి దాఖలైన పిటిషన్లు కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉండగా, ఆ గుర్తును అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి వర్గానికి ఎలా కేటాయిస్తారంటూ మద్రాసు హైకోర్టులో దిండిగల్ జిల్లాకు చెందిన సూర్యమూర్తి అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈనెల 25న విచారణ జరగనుంది. పైగా ఈ అంశంలో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. దీంతో రెండాకుల గుర్తును ఎడప్పాడి వర్గానికి కేటాయిస్తారా? లేదా? అన్నది సందేహాస్పదంగా మారింది. సూర్యమూర్తి దాఖలు చేసిన పిటిషన్‌లో 2017లో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా శశికళ ఉన్నారు. ఆ తర్వాత పార్టీ కన్వీనర్లుగా ఎడప్పాడి, ఓ.పన్నీర్‌సెల్వంను ఎన్నుకున్నారు. కొద్ది రోజుల తర్వాత ఎడప్పాడి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈపీఎస్ నియామకాన్ని సవాల్ చూస్తూ తాను దాఖలు చేసిన పిటిషన్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ పరిస్థితుల్లో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రెండాకుల గుర్తును అన్నాడీఎంకేకు కేటాయించరాదని ఆయన మరో పిటిషన్‌ను దాఖలు చేశారు. దీన్ని స్వీకరించిన కోర్టు విచారణను ఈనెల 25వ తేదీకి వాయిదా వేసి, ఈసీ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. దీంతో రెండాకుల గుర్తు అన్నాడీఎంకేకు కేటాయిస్తారా? లేక తాత్కాలికంగా స్తంభింపజేస్తారా? అన్న చర్చ ఆ పార్టీ శ్రేణుల్లో సాగుతోంది.

సీపీఎంకు మదురై, దిండుగల్

● సీపీఐకి నాగపట్టినం, తిరుప్పూర్

ప్యారీస్, మార్చి 12: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి డీఎంకే కూటమిలో సీట్ల సర్దుబాటు ముగియడంతో స్థానాలు ఖరారు పూర్తి కావచ్చింది. తమ కూటమి పార్టీ సీపీఎంకు మదురై, దిండుగల్ స్థానాలు కేటాయించిన డీఎంకే.. సీపీఐకి నాగపట్టినం, తిరుప్పూర్ నియోజకవర్గాలను కట్టబెట్టింది. గత ఎన్నికల్లో సీపీఎం మదురై, కోవైలో పోటీ చేసిన విషయం తెలిసిందే. ఇదే కూటమి భాగస్వాములు కాంగ్రెస్‌కు 10, డీపీఐకు రెండు, ఎండీఎంకేకు ఒకటి, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చికు ఒకటి, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీకి ఒక స్థానాన్ని డీఎంకే కేటాయించింది. మిగతా 21 స్థానాల్లో పోటీ చేయనుంది. ఇందులో ఐయూఎంఎల్‌కు రామనాథపురం, కొంగునాడు మక్కల్ పార్టీకి నామక్కల్, డీపీఐకి చిదంబరం, విల్లుపురం నియోజకవర్గాలను కేటాయించిన విషయం తెలిసిందే.

అన్నాడీఎంకే జెండా, గుర్తు వినియోగంపై నిషేధం
తేది ప్రకటించకుండా తీర్పు వాయిదా

పెరంబూర్, మార్చి 12: అన్నాడీఎంకే జెండా, గుర్తు తదితరాలు ఓ.పన్నీర్‌సెల్వం వినియోగించడంపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ తీర్పును తేది ప్రకటించకుండా మద్రాసు హైకోర్టు వాయిదా వేసింది. అన్ని వాదనలు ముగిసిన నేపథ్యంలో తీర్పును న్యాయమూర్తి ఎన్.సతీష్‌కుమార్ వాయిదా వేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఈపీఎస్‌ను ఎంపిక చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన కేసుపై విచారణ జరుగుతోంది. అందువల్ల సమన్వయకర్త హోదాలో పార్టీ నుంచి అతన్ని తొలగించే అధికారం తనకు ఉందని ఓపీఎస్ తరపున వాదించారు.

డీఎంకే తీరును నిరసిస్తూ అన్నాడీఎంకే ధర్నా



ధర్నాలో అన్నాడీఎంకే నేతలు, కార్యకర్తలు - చెన్నై అభిరామపురంలో అన్నాడీఎంకే కార్యకర్తల వినూత్న నిరసన

వేలూరు, మార్చి 12: డీఎంకే పాలనలో రాష్ట్రం మత్తుపదార్థాల గిడ్డంగిగా మారిందని అన్నాడీఎంకే ఆధ్వర్యంలో మంగళవారం మానవహారం నిర్వహించారు. వేలూరు మా నగర జిల్లా పార్టీ తరపున జిల్లా సెక్రటరీ ఎస్ఆర్కే అప్పు నేతృత్వంలో కాట్పాడి, సత్తువాచేరి, అన్నాసాలై గాంధీ విగ్రహం సహా పలు ప్రాంతాల్లో నేతలు, కార్యకర్తలు మానవహారం ఏర్పాటు చేసి డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ ఐటీ వింగ్ సెక్రటరీ జననీ సతీష్‌కుమార్, పార్టీ కోశాధికారి మూర్తి, జాయింట్ సెక్రటరీ సుఖన్యదాస్, ఉపసెక్రటరీలు జయప్రకాశ్, ఉమా విజయకుమార్, పార్టీ నేతలు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాట్‌ఫాం నిర్మాణ పనులకు శంకుస్థాపన

● రూ.74.50 కోట్ల వ్యయంతో నిర్మాణం
● రైల్వే స్టేషన్ - బస్టాండు అనుసంధానం

అడయార్, మార్చి 12: నగర శివారు ప్రాంతమైన కీలంబాక్కంలో ప్రభుత్వం అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన మఫిషల్ బస్టాండు, కీలంబాక్కం రైల్వే స్టేషన్‌ను అనుసంధానం చేసే వంతెనతోపాటు కీలంబాక్కం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంల నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి పీకే శేఖర్ బాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ పనులను రూ.74.50 కోట్లతో పూర్తి చేయనున్నారు. దక్షిణాది జిల్లాలకు వెళ్లే దూరప్రాంత బస్సులు నగరంలోకి ప్రవేశించకుండా ఉండేలా కీలంబాక్కంలో మఫిషల్ బస్టాండును నిర్మించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం విదితమే. అయితే, ఈ బస్టాండకు సమీపంలో సబర్బన్ రైళ్లు ఆగి వెళ్లేందుకు వీలుగా రైల్వేస్టేషన్ లేకపోవడంతో కీలంబాక్కంలో కొత్తగా రైల్వేస్టేషన్ నిర్మించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందుకు కేంద్రంతో పాటు రైల్వే శాఖ అనుమతి ఇచ్చింది. దీంతో కీలంబాక్కంలో రైల్వే స్టేషన్ కోసం ప్లాట్‌ఫాంల నిర్మాణంతో పాటు బస్టాండును, రైల్వేస్టేషన్ మధ్య ఉన్న 140 మీటర్ల జాతీయ రహదారిని ప్రయాణికులు సులభంగా దాటేందుకు ఫుట్‌ఓవర్ వంతెనను నిర్మించనున్నారు. ఈ నిర్మాణ పనులకు మంత్రి శేఖర్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలోనే అత్యాధునిక సౌకర్యాలతో మెట్రో పార్కును కూడా నిర్మించనున్నారు. ఈ పనులను ఏడాదిలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఆన్‌లైన్‌లో మాత్రమే ఐపీఎల్ టిక్కెట్లు

పెరంబూర్, మార్చి 12: నగరంలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌ల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో మాత్రమే విక్రయించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఐపీఎల్ 17వ సీజన్ తొలి మ్యాచ్ ఈనెల 22న చేపాక్కం క్రికెట్ మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్ - రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగనుంది. ఈ పోటీలో ధోనీ, విరాట్ కోహ్లి ఆడనున్న నేపథ్యంలో, అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో, నగరంలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించిన టిక్కెట్ల విక్రయాలు ఆన్‌లైన్‌లో మాత్రమే చేపట్టాలని ఫ్రాంచైజీలు నిర్ణయించినట్లు వస్తున్న వార్తలతో, క్రికెట్ అభిమానులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

కరాటే వీరులకు బెల్ట్‌ల ప్రదానం



విద్యార్థులకు బెల్ట్, సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

వేలూరు, మార్చి 12: పేర్నాంబట్టు సమీపం ఎడుకమ్‌పట్టులోని కమ్యూనిటీ హాలులో మంగళవారం క్రీడాకారులకు కరాటే బెల్ట్, సర్టిఫికెట్ అందజేసే కార్యక్రమం జరిగింది. కరాటే పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సెన్‌సాయ్ వెంకట్, ప్రధాన కార్యదర్శి కుమార్, ప్రత్యేక ఎస్ఐలు కామరాజ్, కార్తీక్, శరవణన్, అటవీ శాఖ అధికారి మురళి, పంచాయతీ సెక్రటరీ కలైఅరసన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మార్చి 12: జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నాసాలైలో ఉన్న ఏలగిరి హాలులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రస్తుతం రసాయనాలు వేసి పండిస్తున్న పంటల ద్వారా చిన్న వయసు నుంచే ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. సేంద్రీయ వ్యవసాయంతో చేపట్టిన ఉత్పత్తులు వినియోగించాలని, రైతులు కూడా సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ సోము, మండల జాయింట్ డైరెక్టర్ రాజేంద్రన్, ఇంజనీర్ శ్రీధర్, వ్యవసాయ శాఖ పథక డైరెక్టర్ స్టీఫెన్ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న చిత్రాలను ప్రేక్షకుల చెంతకు చేర్చడం కష్టం

చిత్రజ్యోతి

● దర్శకుడు పా.రంజిత్

ప్రస్తుతం చిన్న చిత్రాలను ప్రేక్షకుల వద్దకు చేర్చడం కష్టతరంగా మారిందని ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ అన్నారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్‌కుమార్ హీరోగా నటించిన తాజా చిత్రం 'రెబల్'. ఈనెల 22న విడుదలకానుంది. స్టూడియోగ్రీన్ పతాకంపై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించగా, మమితా బైజు హీరోయిన్‌గా నటించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. సోమవారం రాత్రి ఈ సినిమా ఆడియో, ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పా.రంజిత్ పాల్గొని ప్రసంగిస్తూ... 'ఇది రెబల్ ఆడియో వేదికగా లేదు. నన్ను ప్రశంసించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలా ఉంది. ఇంత మంది నన్ను ప్రశంసిస్తున్నారంటే నేను నా విధులను సక్రమంగానే నిర్వహిస్తున్నాననే భావన కలుగుతోంది. ఈ సినిమా కేరళ, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉండే ముల్లై పెరియార్ ప్రాంతంలోని సమస్యలను ప్రస్తావించనుంది. ఈ రెండు రాష్ట్రాల మధ్య ఎన్నో దశాబ్దాలుగా ఉండే సమస్యను దర్శకుడు నికేష్ చాకచక్యంగా డీల్ చేశారు. నిర్మాత జ్ఞానవేల్ రాజా పలువురి జీవితాల్లో వెలుగులు నింపారు. నా జీవితంలో కూడా ముఖ్యమైన మనిషి. హీరో జీవీ ప్రకాష్ చాలా మంచి వ్యక్తి' అని పేర్కొన్నారు. హీరో జీవీ ప్రకాష్ మాట్లాడుతూ... 'పా.రంజిత్‌తో కలిసి 'తంగలాన్'తో పాటు మరో చిత్రంలో పనిచేస్తున్నా. ఈ సినిమా బాగా వచ్చింది. శక్తి ఫిలిమ్స్ అధినేత శక్తివేలన్ ఈ సినిమాను చూశారు. అందుకే ఇంత సంతోషంగా ఉన్నారు. ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఉంటుంది' అన్నారు. దర్శకుడు నికేష్ మాట్లాడుతూ... 'నిర్మాతకు స్టోరీ వినిపించేందుకు వెళ్లినపుడు నా వయసు 24 యేళ్లు మాత్రమే. కానీ, నాపై ఎంతో నమ్మకం ఉంచి నిర్మాత జ్ఞానవేల్ ముందుకు వచ్చారు. ఆ తర్వాత షూటింగ్ ముగిసేంత వరకు ఒక్క ప్రశ్న కూడా అడగలేదు. ఈ సినియాను విజయవంతంగా పూర్తిచేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అన్నారు. అలాగే, నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా, దర్శక నటుడు సుబ్రమణ్య శివ, నటుడు ఆదిత్య భాస్కర్, హీరోయిన్ మమిత బైజు తదితరులు ప్రసంగించారు.


'రెబల్' ఆడియో రిలీజ్ దృశ్యం

డిస్నీ హాట్‌స్టార్‌లో 'హార్ట్‌బీట్' స్ట్రీమింగ్


'హార్ట్‌బీట్'లో ఓ దృశ్యం

దేశంలోని ప్రముఖ ఓటీటీ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంలలో ఒకటైన డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో 'హార్ట్‌బీట్' పేరుతో తెరకెక్కించిన స్పెషల్ సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది. ఒక ఆస్పత్రిలో పనిచేసే వైద్యులు, సిబ్బంది చుట్టూ తిరిగే కథతో ఆసక్తికరమైన సంఘటనల ఆధారంగా తెరకెక్కించారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతుండగా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ సిరీస్‌లో అనుమోల్, దీపా బాలు,యోగలక్ష్మి, థాపా, చారుకేష్, రామ్స్,శబరేష్, పతినే కుమార్, గురు లక్ష్మణ్, జయరావు,గిరి, ద్వారకేష్, చంద్రశేఖర్,దేవీశ్రీ, కవితాలయ కృష్ణన్, రియా,స్మైల్ సెల్వ, శరవణన్ రాజవేల్ తదితరులు నటించారు. ఈ సిరీస్‌ను ఏ టెలీ ఫ్యాక్టరీ నిర్మించింది.దీపక్ సుందర్‌రాజన్ దర్శకత్వం వహించారు.

మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ధృవ్‌విక్రమ్

'కర్ణన్, 'మామన్నన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల డైరెక్టర్ మారి సెల్వరాజ్ తన తదుపరి ప్రాజెక్టును ప్రకటించారు. అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్ సమర్పణలో ప్రముఖ దర్శకుడు పా.రంజిత్‌కు చెందిన నీలం ప్రొడక్షన్స్ బ్యానరుపై కొత్త చిత్రం తెరకెక్కనుంది. ఇంకా టైటిల్ ఖరారుకాని ఈ చిత్రంలో ధృవ్ విక్రమ్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించనున్నారు. చియాన్ విక్రమ్ తనయుడిగా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన ధృవ్ విక్రమ్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ కొత్త ప్రాజెక్టు గురించి అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ సమీర్ నాయర్ మాట్లాడుతూ... 'నీలమ్ స్టూడియోతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించనుండడం సంతోషంగా ఉంది. ఈ కొత్త ప్రాజెక్టు మారి సెల్వరాజ్ దర్శకత్వ ప్రతిభ, సూపర్ టెక్నికల్ సిబ్బంది సహకారంతో దక్షిణ భారత చిత్రపరిశ్రమలో మంచి చిత్రంగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు. నీలం స్టూడియోస్ నిర్మాతలు పా.రంజిత్, అదితి ఆనంద్ మాట్లాడుతూ... 'పరియేరుమ్ పెరుమాళ్' చిత్రం వంటి ఘనవిజయం తర్వాత దర్శకుడు మారి సెల్వరాజ్‌తో కలిసి నీలం స్టూడియోస్ నిర్మించే చిత్రం. కచ్చితంగా మరో హిట్‌గా నిలుస్తుంది' అని అన్నారు. దర్శకుడు మారి సెల్వరాజ్ మాట్లాడుతూ... 'రంజిత్‌తో కలిసి నేను తెరకెక్కించిన తొలి చిత్రం బ్లాక్‌బస్టర్ విజయం సాధించింది. నేను దర్శకత్వం వహించిన చిత్రాలకు అది గీటురాయిగా నిలిచింది. ఇపుడు రంజిత్‌తో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది. ఇది నేను దర్శకత్వం వహించే ఐదో చిత్రం' అని వివరించారు.


ధృవ్ విక్రమ్, మారి సెల్వరాజ్, పా.రంజిత్, అనుపమ తదితరులు

మీ జీవితం.. మీకు నచ్చినట్టుగా జీవించండి

● వరలక్ష్మి శరత్ కుమార్



దేశంలోని మహిళలకు సినీ నటి వరలక్ష్మి శరత్ కుమార్ ఓ పిలుపునిచ్చారు. 'మీ జీవితం మీకు నచ్చినట్టుగా జీవించండి' అంటూ కోరారు. ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో ఓ పోస్టు చేస్తూ, 'నా గురించి ఇతరులు చేసే విమర్శలను ఏమాత్రం పట్టించుకోను. బాధపడను. ఇతరుల గురించి ఏమాత్రం పట్టించుకోకుండా మహిళలు తమ పని తాము చేసుకుంటూ ముందుకుసాగిపోవాలి. మీకోసం మీరు జీవించండి. ఈ పని చేయొద్దు.. ఆ పని చేయొద్దు అని చెప్పే వారి గురించి ఏమాత్రం పట్టించుకోవద్దు. అలాంటి వారు జీవితంలో మీతో కలిసి ప్రయాణించబోయేది లేదు. మీరు మాత్రమే మీ జీవితానికి అండగా ఉంటారు' అని ఆమె పేర్కొన్నారు. కాగా, వరలక్ష్మి శరత్ కుమార్‌కు ఇటీవల ముంబైకు చెందిన పారిశ్రామికవేత్త లికోలాయ్ సచ్‌దేవ్‌తో నిశ్చితార్థం జరిగిన విషయం తెల్సిందే.

నల్లి కుప్పుస్వామి చెట్టికి జీవన సాఫల్య పురస్కారం



నల్లి కుప్పుస్వామి చెట్టికి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త నల్లి కుప్పుస్వామి చెట్టిని 'హ్యూమనిటేరియన్' జీవన సాఫల్య పురస్కారం వరించింది. ఆయనతో పాటు పుదుచ్చేరి పర్యాటక శాఖ మంత్రి లక్ష్మీ నారాయణన్, రాహుల్ శివశంకర్, నటి రాధిక శరత్‌కుమార్, నటి అనన్య పాండే, తోర్రై ఫౌండేషన్ నిర్వాహకురాలు సుమిత్రా ప్రసాద్, సామాజికవేత్తలు శైలజ, హీనా, దివ్య పరమేశ్వరి, శివగామిలకు కూడా నిర్వాహకులు హ్యూమనిటేరియన్ అవార్డు ప్రదానం చేశారు. బాలల హక్కుల కోసం ప్రచారం చేయడం, చిన్నారులపై లైంగిక వేధింపులను నిరోధించడమే లక్ష్యంగా పని చేస్తున్న సామాజిక కార్యకర్త అప్సర రెడ్డి యేటా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాదికి ఇటీవల తేనాంపేటలోని ఓ హోటల్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరైన ఈ కార్యక్రమాన్ని కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్సరా రెడ్డి ప్రసంగిస్తూ... పిల్లలపై హింసకు వ్యతిరేకంగా ప్రచారం చేయడమే తన లక్ష్యమని వివరించారు.

డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ

ప్యారీస్, మార్చి 12: డిజిటల్ ఇండియా పథకం కింద నాస్కామ్ ఫౌండేషన్, డీహెచ్‌సీ టెక్నాలజీ సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్రంలో డిజిటల్ అక్షరాస్యత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో డీహెచ్‌సీ టెక్నాలజీ ఇండియా నిర్వాహక డైరెక్టర్ నచ్చికేత్ సుత్తాంకార్ మీడియాతో మాట్లాడుతూ... నాస్కామ్ ఫౌండేషన్‌తో తమ సంస్థ భాగస్వామ్యం కుదుర్చుకున్న కారణంగా దేశవ్యాప్తంగా డిజిటల్ అక్షరాస్యత శిక్షణ ద్వారా సుమారు 4 లక్షల మంది ప్రయోజనం పొందారని, వీరిలో 50 వేలకు పైగా తమిళనాడుకు చెందిన వారని తెలిపారు. డిజిటల్ అక్షరాస్యత మెరుగుపరచడంలో, టైట్-2లో భారతీయ యువతను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. రాష్ట్రంలో డిజిటల్ సమ్మిళిత సమాజాన్ని సాధించడానికి, నైపుణ్యం కలిగిన వర్క్ ఫోర్స్‌ను అభివృద్ధి చేయడానికి గత సంవత్సరంలో సాధించిన పురోగతి వివరాలు వెల్లడించారు. శిక్షణ పూర్తిచేసిన 1,000 మందికి పైగా యువకులకు దేశంలోని బ్రాండెడ్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించామని ఆయన తెలిపారు.


విద్యార్థులతో నచ్చికేత్ సుత్తాంకార్

అరటి తోటలో చొరబడిన మొసలి

● బంధించిన అటవీశాఖ సిబ్బంది



పెరంబూర్, మార్చి 12: అరటి తోటలో చొరబడిన మొసలి అటవీ శాఖ సిబ్బంది బంధించారు. కోయంబత్తూర్ జిల్లా మొక్కమేడు ప్రాంతానికి చెందిన తమిళ్‌సెల్వన్ అరటి పంట సాగుచేస్తున్నాడు. మంగళవారం ఉదయం యధావిధిగా తోటకు వెళ్లిన సమయంలో కిందపడిన అరటి ఆకులు కదలడం గమనించి అక్కడికి వెళ్లగా 12 అడుగుల పొడవున్న మొసలిని చూశాడు. వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం చేరవేశాడు. సిరుముగై ఫారెస్ట్ రేంజర్ మనోజ్‌కుమార్ సిబ్బందితో తోటకు చేరుకుని గంట పాటు శ్రమించి మొసలిని బంధించారు. సమీపంలోని పిల్లూరు జలాశయంలో వదలి పెట్టారు.

తిరుమలేశుడి సేవలో రజనీకాంత్ కుమార్తెలు



తిరుమల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ రజనీకాంత్ కుమార్తెలు ఐశ్వర్య, సౌందర్య మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన వీరు ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

ప్రధాని మోదీ కుమరి పర్యటనలో స్వల్ప మార్పు



అడయార్, మార్చి 12: ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనలో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. బీజేపీ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల తరపున ఆయన ప్రచారం చేసేలా ఈనెల 16న కన్నియాకుమారిలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో పాల్గొనాల్సి ఉంది. అయితే, ఈ పర్యటన ఒక రోజు ముందుకు జరిగింది. ఈ నెల 16వ తేదీకి బదులు ఈనెల 15వ తేదీనే ఆయన రాష్ట్రంలో పర్యటించనున్నారు. 15వ తేదీ శుక్రవారం కన్నియాకుమారిలోని వివేకానంద కాలేజీ మైదానంలో జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. ఈ బహిరంగ సభ కోసం బీజేపీ శ్రేణులు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా వాస్తవానికి ఈనెల 15న సేలంలో పీఎం పర్యటించాల్సి ఉంది.

చెన్నై డాక్టర్‌కు వ్యతిరేకంగా లుకౌట్ నోటీసు

ప్యారీస్, మార్చి 12: స్థానిక చూలైలో కట్నం కోసం భార్యను చిత్రహింసలు పెట్టిన కేసులో డాక్టర్ ఆసిక్‌అలీపై లుకౌట్ నోటీసు జారీచేశారు. 2021 ఏప్రిల్‌లో మదురై తెల్లాకుళం ప్రాంతానికి చెందిన మహిళను ఆసిక్‌అలీ వివాహం చేసుకున్నాడు. వధువు ఇంటి తరపున 200 సవర్ల నగలు, రూ.5 లక్షల నగదు, గృహ సామగ్రిని కట్నంగా సమర్పించారు. ఈ నేపథ్యంలో, ఆసిక్‌అలీ భార్య ఇర్ఫాన్‌నస్రీన్ దాఖలుచేసిన పిటిషన్‌లో... తన భర్త అదనపు కట్నం కోసం చిత్రహింసలు పెడుతున్నాడని కోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణ మదురై మహిళా న్యాయస్థానంలో జరగ్గా హాజరైన బాధితురాలు... తన భర్త ఐదు సార్లు విచారణకు హాజరుకాలేదని, ఆయనకు జారీచేసిన సమన్లు కూడా తిరిగొచ్చాయని, ఆయనను కోర్టులో హాజరుపరచి తనకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. మంగళవారం ఉదయం మళ్లీ న్యాయమూర్తి శక్తికుమార్ సమక్షంలో ఈ పిటిషన్ విచారణకు రాగా, ఆసిక్‌అలీకి వ్యతిరేకంగా లుకౌట్ నోటీసు ఇవ్వాలని మదురై తల్లాకుళం పోలీసు అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. నోటీసు కాపీలను దేశవ్యాప్తంగా దినపత్రికల్లో ప్రకటనగా విడుదల చేయాలని, అందులో 15 రోజుల్లోపు సంబంధిత వ్యక్తి కోర్టులో హాజరుకావాలంటూ పేర్కొనాలని ఆదేశించారు.

యూడబ్ల్యూఏఎంలో ఘనంగా మహిళా దినోత్సవం



అతిథులు, సత్కారగ్రహీతలతో యూడబ్ల్యూఏఎం నిర్వాహకులు

ప్యారీస్, మార్చి 12: యూనివర్శిటీ ఉమెన్స్ అసోసియేషన్ ఆఫ్ మద్రాస్ (యూడబ్ల్యూఏఎం) ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టి.నగర్‌లోని డబ్ల్యూటీఎఫ్ హాలులో యూడబ్ల్యూఏఎం కార్యదర్శి, ప్రముఖ అథ్లెటిక్ రుక్మిణి దేవి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ప్రముఖ యోగా గురువు విద్యాహరి ముఖ్యఅతిథిగా పాల్గొని, మహిళల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. నిత్యం కుటుంబ పోషణలో బిజీగా ఉన్న మహిళామణులు తమ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపకుండా ప్రతిరోజు వ్యాయామం, మనశ్శాంతి కోసం ధ్యానంలో గడపాలన్నారు. కార్యక్రమంలో భాగంగా డబ్ల్యూటీఎఫ్ కార్యదర్శి శ్రీలక్ష్మీ మోహనరావుకు ఆమె అందిస్తున్న సేవలు గుర్తించి ఉమెన్ అచీవర్ అవార్డు ప్రదానం చేశారు. అలాగే, రుక్మిణి దేవి, ఎంజీఆర్ జానకి మహిళా కళాశాల కరస్పాండెంట్ లత రాజేంద్రన్‌ను ఘనంగా సత్కరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌డీ చదువుకుంటున్న ఐదుగురు విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌గా తలా రూ.15,000 అందజేశారు. కార్యక్రమంలో ఊరా శశికళ, డాక్టర్ టి.మోహనశ్రీ, సుజాత రమేష్‌బాబు, సురేష్ మోహన్‌దాస్, శివకుమారి, మణిమేఘలై, శాంతిలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగానికి బానిసలయ్యారు

● బీజేపీ ధర్నాలో నటి ఖుష్బూ

ప్యారీస్, మార్చి 12: డ్రగ్స్ వినియోగానికి పాఠశాల, కళాశాల విద్యార్థులు బానిసయ్యారని, వీరి భవిష్యత్తు ఏమవుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, నటి ఖుష్బూ ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్‌హిల్స్‌లో పశ్చిమచెన్నై జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో మత్తుపదార్థాల చలామణీ కట్టడి చేయాలని కోరుతూ నిర్వహించిన ధర్నాలో ఖుష్బూ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యా సంస్థల వద్ద మత్తుపదార్థాలు విక్రయిస్తున్న వారిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. ఢిల్లీలో భారీ మొత్తంతో డ్రగ్స్‌తో పట్టుబడిన డీఎంకేకు చెందిన జాఫర్‌సాధిక్ గురించి ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్ర ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గృహిణులకు నెలకు రూ.1,000 అందజేయడం వల్ల లోక్‌సభ ఎన్నికల్లో వారు డీఎంకేకు ఓటేస్తారని ఆ కూటమి నేతలు పలు వేదికలపై ప్రకటించుకుంటున్నారని, అయితే మత్తుపదార్థాలు, టాస్మాక్ మద్యం దుకాణాలను తొలగించకపోవడంపై మహిళలు ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారని చెప్పారు. డీఎంకే కూటమి పార్టీలు కూడా డ్రగ్స్ చలామణీ వ్యవహారంలో నోరుమెదపకుండా ఓటు బ్యాంక్ రాజకీయాలు సాగిస్తున్నాయని ఖుష్బూ మండిపడ్డారు.

నేడు శ్రీలంక దౌత్యకార్యాలయానికి మురుగన్, రాబర్ట్, జయకుమార్

పెరంబూర్, మార్చి 12: మురుగన్, రాబర్ట్ పయాజ్, జయకుమార్‌లను శ్రీలంక దౌత్య కార్యాలయానికి తీసుకెళ్లనున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది. దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యకేసులో యావజ్జీవశిక్ష అనుభవిస్తూ కోర్టు ఉత్తర్వులతో పేరరివాలన్, మురుగన్, శాంతన్, రాబర్ట్ పయాజ్, జయకుమార్ గత ఏడాది నవంబరులో విడుదలయ్యారు. వీరిలో శ్రీలంకకు చెందిన శాంతన్, మురుగన్, రాబర్ట్ పయాజ్, జయకుమార్‌ను తిరుచ్చి కేంద్ర కారాగారం ప్రాంగణంలోని ప్రత్యేక శిబిరానికి తరలించారు. శాంతన్ అనారోగ్యం కారణంగా గత నెల 28వ తేది మృతి చెందాడు. ఈ నేపథ్యంలో, మురుగన్ భార్య, రాజీవ్ గాంధీ హత్యకేసులో యావజ్జీవశిక్ష అనుభవిస్తూ విడుదలైన నళిని మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లండన్‌లో ఉంటున్న తన కుమార్తెతో కలసి జీవించేందుకు తాను, తన భర్త మురుగన్ పాస్‌పోర్ట్ కోరుతూ దరఖాస్తు చేసుకున్నామని, తన భర్త శ్రీలంక పౌరుడు కావడంతో, అతనిని చెన్నైలోని శ్రీలంక దౌత్య కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు అనుమతించేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. ఈ కేసు మంగళవారం విచారణకు రాగా రాష్ట్రప్రభుత్వం తరఫున... మురుగన్ ఇంటర్వ్యూ కోసం బుధవారం అనుమతి తీసుకున్నట్లు, మురుగన్ మినహా శిబిరంలో ఉన్న రాబర్ట్ పయాజ్, జయకుమార్ కూడా పాస్‌పోర్ట్ కోసం తీసుకెళ్లాలని కోరినట్లు తెలిపింది. అందువల్ల బుధవారం వారిని కూడా తగిన భద్రత మధ్య తీసుకెళ్లనున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది. ఆ ప్రకారం, మురుగన్ బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు తిరుచ్చి శిబిరం నుంచి బయల్దేరి ఉదయం 11.30 గంటలకు చెన్నైలోని శ్రీలంక దౌత్య కార్యాలయానికి తీసుకురానున్నట్లు పోలీసు శాఖ వివరణ ఇచ్చింది. ప్రభుత్వ, పోలీసు వాదనలు పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం, నళిని కేసు విచారణ ముగిసినట్లు ఉత్తర్వులు జారీ చేసింది.


చెన్నై సెంట్రల్ సమీపంలోని రిప్పన్ భవనంలో జిల్లా ఎన్నికల అధికారి జె.రాధాకృష్ణన్ నేతృత్వంలో మంగళవారం 2024 లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందికి శిక్షణ అందిస్తున్న దృశ్యం



చెన్నై సచివాలయంలో మంగళవారం సీఎం స్టాలిన్‌ను కలుసుకొని, రాష్ట్రప్రభుత్వ పథకాల అమలును పరిశీలించి నివేదిక అందజేస్తున్న రాష్ట్ర పథకాల కమిటీ ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ జె.జయరంజన్ (చిత్రంలో) పథకాలు, అభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి రమేష్‌చంద్ మీనా

● అంకిత్ తివారీ పిటిషన్

విచారణ నుంచి తప్పుకున్న న్యాయమూర్తి

పెరంబూర్,మార్చి12: లంచం తీసుకున్న వ్యవహారంలో అరెస్టయిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అంకిత్ తివారి జామీను పిటిషన్ విచారణ నుంచి హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తి తప్పుకున్నారు. కొత్త న్యాయమూర్తిని ప్రధాన న్యాయమూర్తి ఎంపిక చేస్తారని ప్రకటించారు. దిండుగల్ ప్రభుత్వ వైద్యుడు సురేష్‌ను ఆదాయానికి మించి ఆస్తులున్న కేసు నుంచి విడుదల చేసేందుకు రూ.20 లక్షలు తీసుకున్న కేసులో అరెస్టైన అంకిత్ తివారి మదురై కేంద్ర కారాగారంలో ఉన్నారు. ఆయన దాఖలుచేసిన బెయిలు పిటిషన్లను దిగువ న్యాయస్థానం, హైకోర్టు మదురై బెంచ్ తోసిపుచ్చాయి.ఈ నేపథ్యంలో, అంకిత్ తివారి జామీను కోరుతూ మళ్లీ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు.ఈ పిటిషన్ మంగళవారం న్యాయమూర్తి వివేక్‌కుమార్ ముందు విచారణకువచ్చిన సమయంలో,ఈ విచారణ నుంచి తాను తప్పు కుంటున్నట్లు ప్రకటించిన న్యాయమూర్తి, విచారణ వేరే న్యాయమూర్తికి సిఫారసు చేయాలని ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు.

తదుపరి కార్యాచరణపై ఆ ఇద్దరు నేతల ఆలోచనలు



అడయార్, మార్చి 12: రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీతో పొత్తుపెట్టుకుని ఎన్నికల బరిలోకి దిగాలని ప్రాంతీయ పార్టీలైన పీఎంకే, డీఎండీకేలు భావించాయి. ఈ విషయంపై బీజేపీ నేతలతో పీఎంకే వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాందాస్, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత చర్చలు జరిపారు. ఈ చర్చలు ఫలించకపోవడంతో వారు బీజేపీతో జట్టుకట్టరాదన్న నిర్ణయానికి వచ్చారు. అదే సమయంలో తామే ఒక కూటమిగా ఏర్పడి పోటీ చేయాలన్న ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం ఒక చోట సమావేశమైన చర్చించాలని రాందాస్, ప్రేమలత భావిస్తున్నారని, ఆయా పార్టీల వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, అన్నాడీఎంకే నుంచి మరోమారు చర్చలకు పిలుపు రావొచ్చన్న నమ్మకంతో ప్రేమలత ఉన్నారు. దీంతో ఆమె వేచి చూడాలన్న ధోరణిని అవలంబిస్తున్నారు.

ఎన్నికల కోసం ఉదయనిధి 38 రోజుల ప్రచారం

● చెన్నైలో పది రోజులకు ఒకసారి

అడయార్, మార్చి 12: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం డీఎంకే యువజన విభాగ అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి 38 రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించేలా రూట్ మ్యాప్ ఖరారు చేసుకున్నారు. ప్రతి పది రోజులకు ఒకసారి చెన్నై నగరానికి వచ్చి ప్రచారం చేసేలా ఆయన నిర్ణయించుకున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే 21 ఎంపీ సీట్లలలో పోటీ చేయనుండగా, డీఎంకే భాగస్వామ్య పార్టీలు 19 స్థానాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. వీటిలో కాంగ్రెస్ 10, సీపీఐ 2, సీపీఎం 2, వీసీకే 2, ఎండీఎంకే 1, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ , కొంగు మక్కల్ దేశీయ కట్చి ఒక్కోస్థానం చొప్పున పోటీ చేయనున్నాయి. తమ సొంత పార్టీ అభ్యర్థులతో పాటు కూటమి అభ్యర్థుల విజయం కోసం ఆయన సుదీర్ఘ ఎన్నికల ప్రచారం చేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం ఆయన తనకంటూ ప్రత్యేక ప్రచార వాహనాన్ని కూడా సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ కూడా రాష్ట్రంలో సుడిగాలి పర్యటన చేసేలా తన ప్రచార పర్యటనను సిద్ధం చేసుకుంటున్నారు.

ఆశ్చర్యమే... అయినా వాస్తవం!

● ఓపీఎస్ తరపున పోటీ చేసేందుకు 411 మంది ఆసక్తి

పెరంబూర్, మార్చి 12: మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం ప్రారంభించిన, అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు 411 మంది దరఖాస్తులు సమర్పించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమిలో పోటీ చేసేందుకు పన్నీర్‌సెల్వం నిర్ణయించారు. రాష్ట్రంలోని 39 స్థానాలు, పుదుచ్చేరిలోని ఒక స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న వారు రూ.10,000 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఓపీఎస్ ప్రకటించారు. ఆ ప్రకారం, ఒక్కో నియోజకవర్గానికి 10 చొప్పున దరఖాస్తులు సమర్పించారు. పన్నీర్‌సెల్వం, ఆయన కుమారుడు రవీంద్రనాథ్, జయప్రదీప్ తరఫున పలువురు దరఖాస్తులు సమర్పించారు. అనంతరం దరఖాస్తుదారులను ఓపీఎస్ ఇంటర్వ్యూ చేశారు. పోటీ చేస్తే విజయావకాశాలు ఎలా ఉంటాయి అంటూ ఆశావాహులను ఓపీఎస్ అడిగి తెలుసుకున్నారు.